



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 31-10-2024 సంపుటి : 06 సంచిక : 36 పేజీలు : 8 వెల : రూ 3-00



## ఏపీ సీఎం చంద్రబాబుతో నీతి ఆయోగ్ సీఈవో భేటీ



అమరావతి : నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం ఏపీ సీఎం చంద్రబాబుతో బుధవారం భేటీ అయ్యారు. ఏపీ సచివాలయంలో అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. విజన్ డాక్యుమెంట్-2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా నవ్యాంధ్రను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా, ఏడాదికి 15 శాత వృద్ధిరేటు సాధన ధ్యేయంగా ప్రణాళికను రూపొందించామని సీఈవోకు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా , నియోజకవర్గం వారిగా లక్ష్యాలను తయారు చేసుకున్నామని వెల్లడించారు. వ్యవసాయం, ఆక్వా కల్చర్ రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను రూపొందించామని నీతి ఆయోగ్‌కు వివరించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, ఈజీ ఆఫ్ లీవింగ్, మౌలిక సదుపాయాలు, జనాభా నిర్వాహణ, డేటా సెంటర్లు, ఏఐతో వృద్ధిరేటును పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సలహాదారు, డైరెక్టర్లు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్రా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆ ఏరివేతల వెనుక హెూంశాఖ మంత్రి అమిత్ షా

### కెనడా ప్రభుత్వం ఆరోపణ



న్యూఢిల్లీ, అక్టోబర్ 30 : కెనడాలో ఉన్న సిక్కు వేర్పాటువాదల ఏరివేతకు ప్లాన్ వేసింది భారత హెూంశాఖ మంత్రి అమిత్ షా అని కెనడా ప్రభుత్వం ఆరోపించింది. ప్రధాని మోదీకి సన్నిహితుడైన అమిత్ షా సిక్కు వేర్పాటువాదులను టార్గెట్ చేసినట్లు ఆ దేశం పేర్కొన్నది. కెనడా చేసిన ఆరోపణలను భారత ప్రభుత్వం కొట్టిపారేసింది. ఖలిస్తానీల ఏరివేత వెనుక అమిత్ షా పాత్ర లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. సిక్కు వేర్పాటువాదులను షా టార్గెట్ చేసిన విషయాన్ని కెనడా విదేశాంగ శాఖ మంత్రి డేవిడ్ మారిసన్ తొలుత అమెరికాకు చేరవేశారు. అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు పత్రికకు ఆ సమాచారం ఇచ్చింది తానే అని డేవిడ్ పార్లమెంటరీ ప్యానెల్ భేటీలో తెలిపారు. సిక్కు వేర్పాటువాదుల హత్యకు ప్లాన్ వేసిన వ్యక్తి షానేనా అని ఓ జర్నలిస్టు అడిగారని, అయితే ఆ వ్యక్తికి అవునని తాను సమాధానం ఇచ్చినట్లు మారిసన్ తెలిపారు

## ఏపీలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష తేదీ ప్రకటించిన ఏపీపీఎస్సీ



అమరావతి : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష తేదీని ప్రకటించింది. జనవరి 5న గ్రూప్-2 మెయిన్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పరీక్ష నిర్వహణ ఉంటుందని సంబంధిత అధికారులుతెలిపారు. లక్ష మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. డీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డు పరీక్షలను దృష్టిలో ఉంచుకుని గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్ష తేదీని ఖరారు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించిన ఫైనల్ కీ ని విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం నవంబర్ 2న ఫలితాలను ప్రకటించే అవకాశాలున్నాయి. నవంబర్ మొదటివారంలో మెగా డీఎస్సీ-2024 నోటిఫికేషన్ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సన్నహాలు చేస్తుంది.

## ఆంధ్రప్రదేశ్ లో అడోబ్ ఆర్ అండ్ డి కేంద్రాన్ని ఏర్పాటు చేయండి



**స్మార్ట్ గవర్నెన్స్, ఏఐ-డ్రైవెన్ సొల్యూషన్స్‌లో భాగస్వామ్యం వహించండి!**
**యువతలో డిజిటల్ నైపుణ్యాల మెరుగుదలకు సహకారం అందించండి**
**అడోబ్ సిఇఓతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ**

శాన్ ఫ్రాన్సిస్కో (యుఎస్ఎ):రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టేందుకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అమెరికా టూర్ అవిశ్రాంతంగా కొనసాగుతోంది. తాజాగా శాన్ ఫ్రాన్సిస్కోలో అడోబ్ సిఇఓ శంతను నారాయణ్ తో భేటీ అయిన లోకేష్... ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రగతిశీల ప్రభుత్వం ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో ముందుకు సాగుతోంది, ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పెట్టుబడులకు అన్నివిధాల అనుకూలమైన ప్రాంతమని చెప్పారు. శంతను నారాయణ్ మాట్లాడుతూ... అడోబ్ కంపెనీ ప్రస్తుతం డిజిటల్ మీడియా, క్లౌడ్-ఆధారిత సేవల్లో అగ్రగామిగా ఉంది. ఫోటోషాప్, అక్రోబాట్, ఇల్లస్ట్రేటర్ వంటి సాధనాలను మరింత అందుబాటులోకి తెచ్చాం. సృజనాత్మకత, డాక్యుమెంట్ ఉత్పాదకత, ఏఐ-పవర్డ్ ఇన్నోవేషన్స్ రంగంలో ఎప్పటికప్పుడు అప్ డేటెడ్ వెర్షన్స్ ను అందుబాటులోకి తెస్తున్నాం. ఈ ఏడాది అక్టోబర్ నాటికి తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా రూ.17.95 లక్షలకోట్ల మార్కెట్ క్యాప్ కలిగి ఉందని చెప్పారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఇన్నోవేషన్ అండ్ గ్రోత్ విజన్ తో మీరు చేస్తున్న కృషి ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విజన్‌తో సరిపోతుంది. డిజిటల్ ఫ్లాట్ ఫాంల ద్వారా సృజనాత్మక, వ్యాపార సాధనాల్లో అడోబ్ సేవలు ప్రశంసనీయం. ఎపిలో ఇ-గవర్నెన్స్‌ని సమగ్రపర్చడం, గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చడానికి మీవంతు సహకారం అందించండి. ఎఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం. డిజిటల్ విద్యా ప్లాట్‌ఫారమ్‌లలో ఎఐ ఆధారిత పరిష్కారాలను ఏకీకృతం చేయడంలో మీ భాగస్వామ్యాన్ని కోరుతున్నాం. ఎపిలో అడోబ్ ఆర్ అండ్ డి కేంద్రాన్ని ఏర్పాటు చేయండి. ఆంధ్రప్రదేశ్ లో యువతను డిజిటల్ నైపుణ్యాలతో శక్తివంతం చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నాం. డిజిటల్ ఎడ్యుకేషన్ ను మెరుగుపర్చడంలో భాగంగా డిజిటల్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫారమ్‌లను రాష్ట్రానికి తీసుకురావడానికి అడోబ్ తరపున సహకారం అందించండి. డాక్యుమెంట్ ప్రొడక్టివిటీ, ఎఐ పవర్డ్ టూల్స్‌లో అడోబ్ నైపుణ్యం మాకు ఎంతగానో ఉపకరిస్తుంది. డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, పబ్లిక్ సర్వీస్‌లను క్రమబద్ధీకరించడం, ప్రభుత్వ ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి, స్మార్ట్ గవర్నెన్స్, ఎఐ-డ్రైవెన్ సొల్యూషన్స్ అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలసి పనిచేయండి. ప్రభుత్వం, పరిశ్రమల వినియోగానికి సంబంధించి క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, ప్రభుత్వ కార్యకలాపాలు, పౌరసేవల్లో క్లౌడ్ ఇంటిగ్రేషన్ కు అడోబ్ భాగస్వామ్యం వహించే అంశాన్ని పరిశీలించండి. ప్రభుత్వ సేవలు, స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌ల్లో అడోబ్ ఎఐ ఆధారిత సేవలు, సృజనాత్మకత, డిజిటల్ అనుభవం ఆంధ్రప్రదేశ్ కు ఉపయోగపడతాయి. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, స్టార్టప్‌లకు అడోబ్ యొక్క సృజనాత్మక సాధనాలు ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి దోహదపడతాయి, ఎపి ప్రభుత్వంతో కలసి పనిచేయాలని లోకేష్ కోరారు. మంత్రి చేసిన ప్రతిపాదనలపై శంతన్ నారాయణ్ స్పందిస్తూ... కంపెనీలోని సహచరులతో చర్చించి ఎపిలో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

## జగన్ బెయిల్ రద్దుకు కుట్ర అనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్ : వైఎస్ షర్మిల



అమరావతి : ఏపీ మాజీ సీఎం జగన్ బెయిల్ రద్దుకు కుట్ర జరుగుతుందని పేర్కొనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని వైఎస్ షర్మిల అన్నారు. కుటుంబంలో ఆస్తుల పంపకంలో జరుగుతున్న వివాదంపై మరోసారి ఆమె స్పందించారు. వందశాతం వాటాలు బదలాయిస్తామని ఎంవోయూ(ఓూజ) పై వైఎస్ జగన్ సంతకం చేశారు. బెయిల్ రద్దవుతుందని సంతకం చేసినప్పుడు తెలియదా? అంటూ ఎద్దేవా చేశారు. 2021లో క్లాసిక్ రియాలిటీ, సండూర్, సరస్వతి షేర్లను ఎలా అమ్మారు? విజయమ్మకు రూ. 42 కోట్లకు షేర్లు ఎలా అమ్మారు? షేర్లు అమ్మడం స్టేటస్ కోను ఉల్లంఘించినట్లు కాదా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. షేర్ల బదిలీకి, బెయిల్ రద్దుకు సంబంధం లేదని మీకు తెలుసు కాబట్టే షేర్లను విక్రయించి, సంతకాలు చేశారని ఆరోపించారు. షేర్లు విక్రయించి ఇప్పుడేమో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ బెయిల్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదని విజయమ్మకు తెలుసని అన్నారు. ఈడీ అటాచ్ చేసింది షేర్లు కాదని, రూ. 32 కోట్లు విలువైన కంపెనీ స్థిరాస్తి అని పేర్కొన్నారు. షేర్ల బదలాంపుపై ఎలాంటి ఆంక్షలు, అభ్యంతరాలు తనకు లేవని వెల్లడించారు. స్టేటస్‌కో ఉన్నది షేర్లపై కాదని తెలిపారు. గతంలోనూ ఎన్నో కంపెనీల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. అటాచ్ చేసిన వాటి షేర్లు, స్టాక్‌మార్కెట్‌లో ట్రేడింగ్, బదిలీలు మాత్రం ఆపలేదని అన్నారు. ఈడీ అటాచ్ చేసినందువల్ల షేర్ల బదిలీ చేయకూడదనడం హాస్యాస్పదమని షర్మిల తెలిపారు.

## స్వీయ సత్ప్రవర్తన ద్వారానే అవినీతి నిర్మూలన

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30 – అవినీతిని అంతమొందించే ప్రక్రియ స్వీయ సత్ప్రవర్తన ద్వారానే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఉద్ఘాటించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, విజిలెన్స్ ఇంచార్జ్ డిఎస్పి కృష్ణారెడ్డి, జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వారంలో భాగంగా ఈ సంవత్సరం అక్టోబర్ 28 నుండి నవంబర్ 3 తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది దేశం యొక్క శ్రేయస్సు కోసం సమగ్రత, సంస్కృతి అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని... ఈ మూడు పదాలలో ఎంతో అంతర్లీనత దాగి ఉందని పౌరులలో స్వీయ సత్ప్రవర్తన అలవర్చుకొని అవినీతి రహిత సమాజానికి తోడ్పాటు అందించాలన్నారు. మన సత్ప్రవర్తన ద్వారానే అవినీతి నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. అవినీతి వల్లే ప్రపంచంలో మన దేశాన్ని అత్యుత్తమ కేంద్రంగా ఎందుకు చూపించలేకపోయామో మనకు మనమే ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యం రకరకాలుగా గ్రౌండింగ్ చేయడం వల్ల ప్రభుత్వానికి కేజీకి 40/- రూపాయలు ఖర్చవుతుందని, ఈ బియ్యాన్ని సక్రమంగా వినియోగించుకోకుండా తక్కువ రేటుకు విక్రయించడం లాంటి వ్యత్యాసాలకు స్వస్తి పలికి సరి చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఉదహరించారు. అలాగే నకిలీ విత్తనాలు, రసాయనిక ఎరువులతో రైతులు రైతులనే మోసం చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలతో సంబంధం లేకుండా అవినీతిని ప్రోత్సహిస్తూ పనులు చేయించుకునే పరిస్థితి నెల కొనిందన్నారు. ప్రతి సంస్థలో విజిలెన్స్ విభాగం ఉన్నప్పటికీ మన దృక్పథం మార్చుకోనంతవరకు అవినీతి కొనసాగుతూనే ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలన గురించి విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించుకోవడం దురదృష్టకరమన్నారు. అవినీతిపై భారత ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ తెలిసి తెలిసి తప్పులు చేయడం జరుగుతోందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, అగ్నిమాపక అధికారి , డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రమణ, జిల్లా ఖజానా అధికారి లక్ష్మీదేవి, సంక్షేమ వెళ్ళబుచ్చారు. అంతకుముందు విజిలెన్స్ ఇన్చార్జి డిఎస్పి కృష్ణారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవినీతి నియంత్రణపై అధికారులలో అవగాహన కల్పించారు

## ఏపీని కేంద్రానికి తాకట్టుపెట్టిన చంద్రబాబు : మాజీ మంత్రి విమర్శ

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి తాకట్టుపెట్టారని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు ఒక్క అంగుళం తగ్గినా రాష్ట్రమంతా ఉద్యమిస్తామని మీడియా సమావేశంలో హెచ్చరించారు. ఎత్తు తగ్గిస్తే కూటమి ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని విమర్శించారు. రైతుల కోసం చంద్రబాబు ఏ ఒక్క కార్యక్రమాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. రైతు భరోసా కేంద్రాలను, రైతు బీమాకు మంగళం పాడారని మండిపడ్డారు. సూపర్ సిక్స్‌లో రైతులకు రూ. 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఎగ్గొట్టారని తెలిపారు. వైసీపీ హయాంలోవైఎస్ జగన్ అన్ని రకాలుగా ఆదుకున్నారని పేర్కొన్నారు. సకాలంలో రైతు బీమాను రూ. 900 కోట్లు ప్రీమియం చెల్లించి ఉంటే ఇటీవల వచ్చిన తుఫాన్ కారణంగా రూ. 13,000 కోట్ల పంట పరిహారం బీమా కంపెనీల నుంచి వచ్చేదని అభిప్రాయపడ్డారు. రైతు అంటే చంద్రబాబుకు నచ్చదని అన్నారు. రైతు భరోసా కేంద్రాలను గాలికొదిలేశారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లపై రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారని తెలిపారు.



# సంపాదకీయం

గురువారం 31-10-2024

## కంచెలతో ఈశాన్యం శాంతించేనా

భారత్, మయన్మార్ మధ్య స్వేచ్ఛా రవాణా వ్యవస్థ (ఎఫ్ఎంఆర్)ను రద్దు చేయాలని, మెరుగైన నిఘాకు వీలుగా 1640 కిలోమీటర్ల నిడివి గల సరిహద్దులో కంచె వేయాలని, గస్తీ మార్గం నిర్మించాలని కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ తీసుకున్న నిర్ణయం పట్ల తిరుగుబాటు సంస్థ నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఐజాక్ ముయివా గ్రూప్) (ఎన్ఎస్సిఎన్ ఐఎం) సహా నాగా సంస్థలు, మిజో సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మణిపూర్ ముఖ్యమంత్రులు ఆ నిర్ణయాన్ని స్వాగతించారు. మిజోరామ్, నాగాలాండ్ ముఖ్యమంత్రులు రెండు దేశాల మధ్య సరిహద్దు పొడుగునా ముళ్ల కంచె వేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఆ రాష్ట్రాల్లో ఒక్క అసోం మాత్రమే మయన్మార్‌తో సరిహద్దును పంచుకోవడం లేదు. ఎటువంటి వీసా లేకుండా పరస్పర భూభాగంలోకి 16 కిమీ వరకు వెళ్లడానికి సరిహద్దువాసులను అనుమతిస్తున్న ఎఫ్ఎంఆర్ ఒప్పందాన్ని రద్దు చేయాలని మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ 2023 సెప్టెంబర్‌లో కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. 2023 మే 3 నుంచి మణిపూర్‌లో జాతుల మధ్య హింసాకాండ రెచ్చగొట్టడానికి తీవ్రవాదులు ఎఫ్ఎంఆర్‌ను దుర్వినియోగం చేస్తున్నారని మణిపూర్ సిఎం బీరేన్ సింగ్ వాదించారు. భారత్, మయన్మార్ మధ్య 1640 కిలోమీటర్ల నిడివి గల అంతర్జాతీయ సరిహద్దు పొడుగునా కంచె వేయడానికి, రోడ్లు నిర్మించడానికి కేంద్రం రూ. 31 వేల కోట్లు ఖర్చును ఆమోదించినట్లు కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. బీరేన్ సింగ్ వాదనతో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఏకీభవిస్తూ, భారత్‌మయన్మార్ సరిహద్దులో కంచె నిర్మాణం మణిపూర్‌లో హింసాకాండ కట్టడికి కేంద్రం అనుసరిస్తున్న వ్యూహాల్లో ఒకటి అని చెప్పారు. మణిపూర్‌లో జాతుల మధ్య హింసాకాండకు ప్రధాన కారణమైన సరిహద్దులో 30 కిలోమీటర్ల మేర కంచె పని పూర్తి అయిందని అమిత్ షా తెలియజేశారు. మణిపూర్, కేంద్ర హోమ్ శాఖ మంత్రి వాదనను సహేతుకమైన వ్యక్తులు అంగీకరించడం లేదు. స్వాతంత్ర్యం ముందు కాలం నుంచే ఎఫ్ఎంఆర్ అమలులో ఉన్నదని, ఈ ప్రాంతంలో వివిధ జాతి, వర్గాల మధ్య ఆ విధంగా భారీ స్థాయిలో హింసాకాండ చోటు చేసుకోలేదని వారు వాదిస్తున్నారు. మైతైలు కుకీల జాతుల ఘర్షణలు 2023 మేలో మాత్రమే మొదలై ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అందువల్ల మణిపూర్ సిఎం, కేంద్ర హోమ్ శాఖ మంత్రి ఆందోళనలు సరికాదన్నారు. ఎఫ్ఎంఆర్ రద్దుకు రెండు దేశాల మధ్య సరిహద్దుల పొడుగునా కంచె వేయడానికి తీసుకున్న నిర్ణయం మయన్మార్, ఆగ్నేయాసియాతో సన్నిహిత వాణిజ్యం, అనుసంధానం, ప్రజల మధ్య సంబంధాల పెంపునకు 'పొరుగు దేశాలు ముందు' విధానం, 'తూర్పు వైపు కార్యాచరణ' అన్న కేంద్ర ప్రభుత్వ ప్రకటిత సిద్ధాంతాలకు భిన్నమైనది. వలస పాలకుల సమయం నుంచి కూడా ఉనికిలో ఉన్న మయన్మార్‌తో మన సరిహద్దు రవాణా వ్యవస్థను కూడా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తిరగతోడుతున్నట్లు అయింది. అది మన సన్నిహిత పొరుగు దేశంతో సరిహద్దును సీల్ చేసినట్లు అయింది. ఇప్పుడు మణిపూర్ మయన్మార్‌తో పంచుకుంటున్న 390 కిమీ సరిహద్దులో దాదాపు పది కిమీ మేర కంచె వేయడమైంది. మిజోరామ్ ప్రధాన విద్యార్థుల సంస్థ మిజో జిర్లాయ్ పావల్ (ఎంజడ్‌పి) భారత్ మయన్మార్ సరిహద్దులో కంచె వేయాలన్న, స్వేచ్ఛా రవాణా వ్యవస్థను రద్దు చేయాలన్న కేంద్రం నిర్ణయం పట్ల ఐజాల్ నిరసన తెలియజేసింది. భారత్, మయన్మార్, బంగ్లాదేశ్ మధ్య బ్రిటిష్ వారు రూపొందించిన అంతర్జాతీయ సరిహద్దులు మిజో ప్రజలను, వారిని సంప్రదించకుండానే వేరు చేశాయని ఎంజడ్‌పి నాయకులు వాదించారు. ఎఫ్ఎంఆర్‌ని వినియోగించుకుంటూ భారత్‌లోకి అక్రమంగా వలస వచ్చేందుకు మయన్మార్‌లోని తమ బంధువులకు సాయం చేస్తున్నారని మణిపూర్ కుకీలపై ఆరోపణలు ఉన్నాయి. 'మయన్మార్‌కు చెందిన చిన్ కుకీ నార్కో ఉగ్రవాదులు' మణిపూర్‌లో హింసాకాండకు బాధ్యులని మైతైలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థ మణిపూర్ సమైక్యత సమన్వయ కమిటీ (సిఓసిఓఎంఐ కొకొమి) ఆరోపించింది. మయన్మార్ నుంచి 'అక్రమ వలస' మైతైల సంస్కృతి, అస్తిత్వానికి ముప్పుగా పరిణమించిందని కొకొమి నేత ఒకరు ఆరోపించారు. కుకీలు మయన్మార్‌లోని 'డ్రగ్ లార్డ్' ప్రేరేపణతో మణిపూర్ కొండల్లో గంజాయి అక్రమంగా సాగు చేస్తున్నారని, ఆ డ్రగ్స్‌ను తక్కిన భారతానికి, ఇతర ఆగ్నేయాసియా దేశాలకు పంపుతున్నారని మైతైల సంస్థలు ఆరోపిస్తున్నాయి. కుకీ సమాజ సంస్థలు ఆ ఆరోపణలను గట్టిగా తిరస్కరించాయి. మణిపూర్‌లో అసోం తరహా ఎన్‌పిఆర్‌ను కోరడం ద్వారాను, భారత్‌లో కుకీల చరిత్రను చెరిపివేయడం ద్వారాను కుకీలు అందరినీ అక్రమ వలసదారులుగా చిత్రించేందుకు మైతైలు ప్రయత్నిస్తున్నారని కుకీలు ఆరోపించారు. భారత్‌లో, మయన్మార్‌లో నివసిస్తున్న గ్రేటర్ జో సమాజాలకు చెందిన ప్రజలను ఒకే సంస్థ కింద 'ఏకీకరణ చేయాలన్న' డిమాండ్‌ను జాతి భావనలను పంచుకునే మిజోలు, కుకీలు, హమర్‌లు తీవ్రతరం చేశారు. భారత్, మయన్మార్ రెండింటిలోనూ ఉన్న కుకీలు, మిజోలు, హమర్‌లు, మయన్మార్, బంగ్లాదేశ్‌కు చెందిన చిన్‌లు గ్రేటర్ జో సమాజంలో ఉన్నారు. బంగ్లాదేశ్ నుంచి సుమారు వెయ్యి మంది చిన్ కాందిశీకులకు మిజోరామ్ కూడా ఆశ్రయం కల్పించింది. 'తిరుగుబాటువాదులు', బంగ్లాదేశ్ భద్రత బలగాల మధ్య సంఘర్షణ అనంతరం వారు చిట్టగాంగ్ పర్వత శ్రేణులకు పారిపోయారు. శతాబ్దాల తరబడి సీమాంతర గిరిజన సమాజాల మధ్య సన్నిహిత సాంప్రదాయక, ఆచారగత, బంధుత్వ సంబంధాలు, వలస పాలన నాటి సరిహద్దుల కృత్రిమ, నిరంకుశ స్వభావాన్ని గుర్తిస్తూ ఎఫ్ఎంఆర్ రూపొందింది. బ్రిటిష్ వారు అసోం, మణిపూర్‌లను (మొదటి బర్మా యుద్ధం తరువాత బర్మీస్ కాన్‌బాంగ్ రాజవంశం నుంచి 1826లో యండబో సంధి దరిమిలా భారత్, అప్పటి బర్మా మధ్య సరిహద్దులను బ్రిటన్ గీసినప్పటికీ సీమాంతర సంబంధాలను, విభజిత జాతివర్గాల మధ్య కదలికలను పరిమితం ప్రయత్నమైనా ఇబ్బందులు సృష్టిస్తుందని వారు భయపడ్డారు.

## 50 రోజుల్లో 30 లక్షల 23 వేలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30 - శ్రీ మహానందీశ్వర స్వామి ఉండి 50 రోజుల్లో 30 లక్షల 23 వేలు 514 రూపాయలు వచ్చాయని కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం కార్యనిర్వహణాధికారి, ఉప కమిషనర్ ఎన్ శ్రీనివాస రెడ్డి వారి పర్యవేక్షణలో దేవస్థాన అభిషేక మండపం యందు నిర్వహించిన ఉభయ ఆలయముల హుండీ లెక్కింపు యందు 50 రోజులకు భక్తులు సమర్పించిన కానుకల గురించి వివరించారు . 1) ఆలయాలు ద్వారా 29,28,740/- 2) అన్న ప్రసాదం 78,712/- 3) గో సంరక్షణ 16,062/- మొత్తం కలిపి 30,23514/- వచ్చినట్లు తెలిపారు. సదరు హుండీ లెక్కింపునకు దేవాదాయ శాఖా తరుపున నంద్యాల డివిజన్ ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ సి.సురేఖ ,దేవస్థాన ఎఈఓలు వై మధు,టెంపుల్ ఇన్స్పెక్టర్లు మరియు ఆలయ అర్చకులు, సిబ్బంది, ఏజెన్సీ వర్కర్స్, వివిధ జిల్లాల నుండి విచ్చేసిన భ్రమరాంబిక సేవా సమితి సేవకులు, తిరుమల బాలాజీ సేవా సమితి సేవకులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు




విభారె న్యూస్ అక్టోబర్ 30 ఆళ్లగడ్డ ప్రతినిధి :- ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ డా.సుదారాణి అధ్యక్షతన వైస్ ప్రిన్సిపాల్ డా.గంగన్న ఆధ్వర్యంలో రాష్ట్రీయ వక్తా దివాస్ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ సమైక్యత,సమగ్రతలో సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క పాత్ర గురించి విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, సెమినార్ నిర్వహించారు. కళాశాల నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులునాగ మస్తానయ్య, డా.రాజు, డా.వెంకట సబ్బయ్య, డా. జయచంద్ర, స్వరూప , కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## బాణ సంచా విక్రయించే షాపుల వద్ద అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలి.. - జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్..



విభారె న్యూస్ అక్టోబర్ 30 కర్నూలు జిల్లా ప్రతినిధి.. జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెల్పిన జిల్లా ఎస్పీ. బాణ సంచా కాల్చేటప్పుడు పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రతగా ఉండాలి. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్ డయల్ 101 కు గాని ,పోలీసు డయల్ 100 కు గాని లేదా డయల్ 112 గాని సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి. జిల్లా ప్రజలకు,జిల్లా పోలీసు సిబ్బందికి కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ బుధవారం ఒక ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ దీపావళి చీకట్లను పారద్రోలి ప్రజల జీవితాల్లో మరిన్ని కాంతులు నింపాలని ఆకాంక్షించారు. షాపుల వద్ద అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. బాణ సంచా కాల్చేటప్పుడు పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రతగా ఉండాలని కోరారు. హాస్పిటల్స్ వద్ద రోగులకు ఇబ్బందులు కలిగించేలా బాణసంచా కాల్చరాదన్నారు. ప్రజలకు,రోడ్ల వెంబడి వెళ్లే వాహనాదారులకు ఇబ్బందులు కలిగించరాదన్నారు. జిల్లాలో బాణసంచా విక్రయ దుకాణాలు తప్పక లైసెన్సు కల్గి ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధలనకు లోబడి బాణసంచా విక్రయించాలన్నారు. లైసెన్సులు లేకుండా ఎవరైనా టపాసులు నిల్వ చేసినా,అమ్మినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్ డయల్ 101 కు గాని,పోలీసు డయల్ 100 కు గాని లేదా డయల్ 112 గాని సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు జరిపినా, అక్రమంగా నిల్వ ఉంచినా ఆ సమాచారం తెలిసిన వారు పోలీసులకు తెలియ జేయాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ తెలిపారు.

## 335 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో 335 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దపెల్లి జిల్లాలో 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కొనుగోలు కోసం 249 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కేంద్రాలు, 84 ఐకెపి కేంద్రాలు, 2 హెచ్.ఏ.సి.ఏ కేంద్రాలు మొత్తం 335 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని అన్నారు. రైతులు భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకుని రావాలని, ధాన్యం శుభ్రం చేయడం, తేమశాతం వచ్చేలా ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని శ్రీరాంపూర్ మండలం మిర్జంపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాస్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. కాల్వశ్రీరాంపూర్ మండలం మిర్జంపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బి. శ్రీనివాస్ అధికారులకు సమాచారం అందించకుండా విధులకు గైర్హాజరు కావడం, అనుమతి లేకుండా సెలవు పై వెళ్లడం గమనించి పై అధికారులు పలుమార్లు మెమోలు జారీ చేశారని కలెక్టర్ తెలిపారు. ఉన్నతాధికారులు పలుమార్లు అందించిన సూచనలు ఆదేశాలను పట్టించుకోకుండా, విధులలో చేరమని అక్టోబర్ 26న చివరి అవకాశం ఇచ్చినప్పటికీ విధులలో చేరకపోవడం కారణంగా పంచాయతీ కార్యదర్శి ని విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నామని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఒక్కో దుకాణం నుంచి రూ.44 వేలు : ధరలు పేలిపోతున్నాయ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30-నంద్యాల లో ప్రజాప్రతినిధుల అనుచరులు అసోసియేషన్ గా ఏర్పడి వ్యాపారుల నుంచి డబ్బులు తీసుకుని షెడ్డు ఏర్పాటు మొదలు సౌకర్యాల కల్పన, అన్ని శాఖల అనుమతులు ఇప్పిస్తామని ఒక్కో దుకాణదారుడి నుంచి రూ.44 వేలు, తీసుకున్నారని దుకాణ దారులు వాపోతున్నారు . నంద్యాలలో 78-. దుకాణాలకుఅనుమతులు ఇచ్చామని అధికారులు చెబుతున్నారు .వ్యాపారులు ఈనెల 30-31-, 01 - వ తేదీల్లోఅమ్మకాలు సాగించాల్సిఉంటుందని తెలిపారు . "షెడ్డు నిర్మాణం, అనుమతులరుసుము చెల్లింపు ఖర్చులుపోను ఒక దుకాణం మీద రూ.15 వేల వరకు అసోసియేషన్ వారికి మిగులుతుందని ఆరోపిస్తున్నారు . ఒక్కో వ్యాపారికి రూ.44 వేల అసోసియేషన్ వారికి ఇచ్చినట్లు సమాచారం . అందుకే ధరలు పెంచాల్సి వస్తోంది ఓ వ్యాపారివిలేకరుల ఎదుట వాపోయారు.

## ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్టీసీ అధికారులతో సమావేశం..






విభారె న్యూస్ అక్టోబర్ 30 కర్నూలు జిల్లా ప్రతినిధి..గురువారం రోజు స్థానిక ఆర్టీసి శిక్షణా కళాశాలలో, కడప జోన్ ఇంచార్జి ఎగ్జిక్యూటివ్ డైరక్టరు సుమంత్ ఆర్ ఆదోని అధ్యక్షతన,కర్నూలు నంద్యాల డిపోల డిపో మేనేజర్లు,మెకానికల్ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఆర్టీసి కేంద్ర కార్యాలయ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (ఆపరేషన్స్) విజయరత్నం ముఖ్య అతిథిగా హాజరై, వారికి టెక్నికల్ ఆడిట్ శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు,నంద్యాల జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీమతి రజియా సుల్తానా, కర్నూలు డిప్యూటి చీఫ్ మెకానికల్ ఇంజినీరు హరినాథ్ బాబు, కర్నూలు-1,కర్నూలు-2 నంద్యాల డిపో మేనేజర్లు మెకానికల్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పి. మురళీకృష్ణ.

విభారె న్యూస్ అక్టోబర్ 30 కర్నూలు జిల్లా ప్రతినిధి..జిల్లా ప్రజలకు,కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు,పార్టీ అభిమానులకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు.పి మురళీకృష్ణ దీపావళి శుభాకాంక్షలుతెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారద్రోలి వెలుగులు ఇచ్చే పండుగ దీపావళి అని,ఈ పండుగను ప్రతి ఒక్కరూ కుటుంబసభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని, ముఖ్యంగా బాణసంచా పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని పేలుడు వస్తువులకు పిల్లలను దూరంగా ఉంచాలని ప్రమాదం జరిగిన తరువాత బాధ పడేకంటే జరగకుండా చూసుకోవడం మంచిదని మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.



# వలంటీర్ల ఫ్యూచర్ ఏంటీ...

విజయవాడ, అక్టోబరు 30, ఎన్నికలకు ముందు..ఎన్నికల తర్వాత..వాళ్ల సెంట్రిక్‌గానే చర్చ. కొనసాగిస్తామని అధినేత హామీ. వద్దు సార్ వాళ్లుంటే పార్టీకి నష్టమని లీడర్లు..పెద్ద ఇష్యూనే నడుస్తుంది.ఏపీలో ఎప్పుడూ ఏదో ఒక హాట్ సబ్జెక్ట్ ఉండనే ఉంటుంది. అందులో వాలంటీర్ల ఇష్యూ ఒకటి. ఎన్నికలకు ముందు నుంచి వాలంటీర్ల సెంట్రిక్‌గానే చర్చ జరుగుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం జోక్యంతో వాలంటీర్లు ఎన్నికల ముందు విధుల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఏపీలో వాలంటీర్ల వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.ఆశయం మంచిదే కానీ ఆచరణలో గాడితప్పింది. ఎంతలా అంటే వైసీపీ మంత్రులు, ప్రభుత్వ పెద్దలే వాలంటీర్లను వైసీపీ కార్యకర్తలుగా చెప్పుకునేంత దుర్వినియోగం చేశారు. దాంతో మంచి కంటే చెడే ఎక్కువ జరిగింది. ఎన్నికలప్పుడు వాలంటీర్లతో రాజీనామా చేయించి వైసీపీ నేతలు పార్టీ కోసం పని చేయించుకున్నారు. ఆ విధంగా ఏపీలోని రెండున్నర లక్షల మంది వాలంటీర్లలో లక్ష మంది దాకా తప్పుకున్నారు.అధికారంలోకి వస్తే వాలంటీర్లను తమ ప్రభుత్వం వస్తే బాగా చూసుకుంటామని వారికి పది వేల గౌరవ వేతనం ఇస్తామని టీడీపీ కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ వాలంటీర్ల విషయంలో అయితే ఎటూ తేల్చడం లేదు. వారు ఉద్యమబాట పడతామని హెచ్చరిస్తున్నారు.మంత్రివర్గ సమావేశాల్లో వాలంటీర్ల ప్రస్తావన వస్తున్నా ఎటూ తేల్చలేకపోతున్నారు. వాలంటీర్ల వ్యవస్థతో వైసీపీకి మంచి కంటే చెడ్డ ఎక్కువ మూటకట్టుకుందని టీడీపీ నేతలు చెబుతున్నారు. వాలంటీర్ వ్యవస్థను అమలు చేస్తే ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యత తగ్గిపోతుందని కూడా భావిస్తున్నారు. అందుకే వారిని కంటిన్యూ చేయడానికి ఒప్పుకోవడం లేదు.సీఎం చంద్రబాబుకు మాత్రం వాలంటీర్ల వ్యవస్థ విషయంలో కచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయని అంటున్నారు. వాలంటీర్లను కొనసాగించాలని ఆయన అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. వాలంటీర్లలో నిజాయితీపరులను చిత్తశుద్ధి, పనితీరు బాగున్న వారిని కొనసాగించాలనుకుంటున్నారట. విద్యార్హతలు బట్టి స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇప్పించి వాళ్ల సేవలు వాడుకోవాలని సీఎం ఆలోచిస్తున్నారని అంటున్నారు.వాలంటీర్లను కొన్ని రకాల ప్రభుత్వ సేవల కోసం వాడుకోవడం ద్వారా..ప్రభుత్వానికి ప్రజలకు మధ్య బలమైన వారధిని ఏర్పాటు చేసుకోవాలని బాబు ఆలోచిస్తున్నారని అంటున్నారు. వాలంటీర్ల విషయంలో వైసీపీ చేసిన తప్పులు చేయకుండా బాగా నడిపిస్తే మంచి వ్యవస్థగా ఉంటుందని భావిస్తున్నారట. ఇక మొత్తం వాలంటీర్లను తీసుకోవడం కంటే రాజీనామా చేసిన వారిని పక్కన పెట్టాలనుకుంటున్నారు.మిగిలిన వారిలో కూడా అర్హత ఉన్నవారిని..అవసరమైన వరకే వాలంటీర్లను తీసుకుని మాట నిలబెట్టుకోవాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తుందని అంటున్నారు. వాలంటీర్ల వ్యవస్థపై త్వరలో మంచి నిర్ణయం రాబోతుందన్న టాక్ వినిపిస్తోంది. నవంబర్ 6న జరిగే మంత్రివర్గ సమావేశంలో వాలంటీర్ల కొనసాగింపు.. కొత్తవారి నియామకంపై డెసిషన్ తీసుకుంటారని అంటున్నారు. ఈసారి వచ్చే వాలంటీర్లు టీడీపీ శిక్షణలో తర్ఫీదు తీసుకుని జనంలోకి వెళ్తారని చెబుతున్నారు.

# సర్వే రాళ్లపై ఆరా తీసే పనిలో సర్కార్

గుంటూరు, అక్టోబరు 30, ఏపీలో భూసరిహద్దు పేరుతో సర్వే రాళ్ల కొనుగోళ్లలోనూ అక్రమాలు జరిగాయంటూ..ఏసీబీ విచారణకు ఆదేశించింది. గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి పాత్ర ఉందన్న ఫిర్యాదులు రావడంతో ఆయనపై కేసు నమోదు చేసింది ఏసీబీ.రాళ్ల కొనుగోలుకు రెవెన్యూ, సర్వే శాఖల నుంచి నిధుల విడుదలపై క్లారిటీ రాకముందే ంఖఓఆఅ నుంచి రూ.470 కోట్ల చెల్లింపులు జరిగాయన్న అలిగేషన్స్ ఉన్నాయి. ప్రభుత్వ అనుమతి, ఆమోదం లేకుండానే నిర్ణయం తీసుకోవడంతో పాటు.. రాళ్ల కొనుగోళ్లలో భారీగా ముడుపులు పొందారన్న ఆరోపణలు ఉన్నాయిఈ నేపథ్యంలో ఏసీబీ ఉన్నతాధికారి ఆధ్వర్యంలోని టీమ్ లేటెస్ట్‌గా ంఖఓఆఅ ఎండీ, గనుల శాఖ డైరెక్టర్ ఆఫీస్‌లకు వెళ్లింది. భూసర్వే కోసం కొన్న సర్వే రాళ్లకు సంబంధించి నడిపిన ఫైళ్లు, చెల్లింపులు, సర్వేశాఖ ఇచ్చిన ఇండెంట్, ఏయే ఏజెన్సీల నుంచి ఎంత రాయి కొన్నారో వివరాలు కావాలని కోరింది. సర్వే రాళ్ల కొనుగోలుపై 15 అంశాల్లో క్లియర్ కట్ ఇన్ఫర్మేషన్ కోరినట్లు తెలుస్తోంది.సరిహద్దు రాళ్ల కోసం రెండు ప్రైవేటు సంస్థల ద్వారా గ్రానైట్ రాళ్లు కొన్నారు. ఇందులో ఓ జూనియర్ అధికారి తన బావమరిదితో కంపెనీ పెట్టించి, ఆ సంస్థకే రాయి సప్లై టెండర్ దక్కేలా చక్రం తిప్పారన్న చర్చ జరుగుతోంది. ఇదంతా వెంకట్‌రెడ్డికి తెలిసే జరిగిందన్న ఫిర్యాదులున్నాయి. ఫస్ట్ విడత కొనుగోళ్ల విలువ రూ.170 కోట్లు. ఒక్కో గ్రానైట్ రాయిని రూ.450కి కొన్నారు. ఇందులో అధికారులకు ఒక్కో రాయిపై రూ.200 కమిషన్‌గా అందినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.ఆ తర్వాత రాజస్థాన్ నుంచి ప్రత్యేకంగా తెలికైన రాళ్లను తెప్పించారు. ఇందులోనూ అవినీతి జరిగిందన్న ఫిర్యాదులు వచ్చాయి. మూడో విడతగా ఒకేసారి 77 లక్షల రాళ్లను కొని జిల్లాలకు పంపించారు. ఈ బిల్లులను సర్వే శాఖ..లేదంటే రెవెన్యూ శాఖ చెల్లించాలి. కానీ ంఖఓఆఅ నిధుల నుంచి రూ.450 కోట్లు చెల్లించారు. మరో 60 లక్షల రాళ్లు కొని..పాలిషింగ్ చేయించడం కోసం రూ.600 కోట్లతో ఎంగ్రేవింగ్ యూనిట్లు పెట్టాలని కూడా ప్రపోజల్స్ పెట్టారు. ఇలా ఇద్దరు జూనియర్ అధికారులతో కలిసి వెంకట్‌రెడ్డి స్కామ్ చేశారని ప్రభుత్వానికి లిఖితపూర్వక ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంశాలపై కూడా విచారణ జరపాలని ప్రభుత్వం ఏసీబీని ఆదేశించింది. ఫైళ్ల పరిశీలన తర్వాత వెంకట్‌రెడ్డిపై, మరో ఇద్దరు అధికారులపై మరో కేసు నమోదు చేయనున్నట్లు సమాచారంస్యాండ్ నుంచి ల్యాండ్ వరకు.. మైనింగ్ నుంచి లిక్కర్ వరకు..కేసు ఏదైనా.. తెరవెనక ఎవరున్నా..అందరి లెక్కలు తీసే పనిలో ఉంది ఏపీ సర్కార్. ఇప్పటికే ఏపీ పోలీసుల దర్యాప్తులో ఉన్న మూడు ప్రధానమైన కేసులను సీఐడీకి అప్పగించింది ప్రభుత్వం. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో మంగళగిరిలోని టీడీపీ ఆఫీస్, ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటిపై దాడి ఘటనలతో పాటు..సంచలనం సృష్టించిన సినీనటి జెత్వానీ కేసునూ సీఐడీకి దర్యాప్తు చేస్తోంది.ఈ మూడు కేసుల్లో వైసీపీ నేతలు, గత సర్కార్ హయాంలో కీలకంగా పనిచేసిన అధికారులు విచారణను ఫేస్ చేస్తున్నారు. ఇక ఇసుక స్కామ్ మీద ఇప్పటికే వెంకట్‌రెడ్డి ఏసీబీ కేసులో జైలుకు వెళ్లారు. ఇప్పుడు సరిహద్దు రాళ్ల వివాదం హాట్ టాపిక్ అయింది. నెక్స్ట్ ఏ కేసులో ఎవరి పేరు తెరమీదకు వస్తుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది.


# వేరీజ్ సజ్జల భార్గవ....

విజయవాడ, అక్టోబరు 30, వైసీపీ హయాంలో చక్రం తిప్పిన యువనేత.. నేడు అజ్ఞాతంలో ఉన్నారు. ఎప్పుడు.. ఎక్కడ.. అరెస్టు చేస్తారో తెలియక చీకటిరాజ్యంలో గడుపుతున్నారు. ఇంత గొప్పగా ఇంట్రడక్షన్ చెప్పిన వ్యక్తికి ఆ పరిస్థితి ఎలా వచ్చిందంటారా? అయితే ఈ స్టోరీ చూడాల్సిందే.సోషల్ మీడియా రాజ్యమేలుతున్న రోజులివి. పెరిగిన టెక్నాలజీని ఉపయోగించుకుని.. ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లుగా చెప్పే పరిస్థితులు వచ్చేశాయి. దీన్ని రాజకీయాల్లోనూ ప్రయోగిస్తున్న కొందరు లబ్ధి పొందుతుంటే.. మరికొందరు తమ అడ్రస్ కూడా గల్లంతైన సందర్భాలు కోకొల్లలు. అలాంటి కోవకే చెందుతారు సజ్జల భార్గవ్. వైసీపీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌గా ఉండి.. పార్టీ కోసం సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా రాతలు రాయించారనే అభియోగం ఆయనపై ఉంది. అయితే.. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక.. భార్గవ్ ఆచూకీ గల్లంతు అయ్యింది. నాడు.. ఓ వెలుగు వెలిగిన యువనేత.. ఇప్పుడు ఎక్కడ ఉన్నారంటూ నెటిజన్లు తెగ ప్రశ్నలేసేస్తున్నారు. సోషల్ మీడియాను ఓ ఆటాడుకున్న భార్గవ్.. అజ్ఞాతంలోంచి ఎప్పుడు వస్తారా అనే చర్చ.. ఏపీ వ్యాప్తంగా సాగుతోందట.సజ్జల భార్గవ్? సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు. గత ప్రభుత్వ హయంలో తండ్రి? సకలశాఖల మంత్రిగా అన్నీ తానై వ్యవహరించగా.. కొడుకు భార్గవ్.. సోషల్ మీడియాకు ఇన్‌ఛార్జ్‌గా ఉండి.. ప్రత్యర్థి పార్టీలతో ఉన్నవి లేనట్లు.. లేనివి ఉన్నట్లుగా ప్రచారాలు చేయించారట. రాజకీయంలో వైసీపీకి లబ్ధి చేకూరేలా చేస్తూ టీడీపీ, జనసేన పార్టీలకు వ్యతిరేకంగా.. తన టీమ్‌తో పోస్టులు పెట్టిస్తూ.. ప్రత్యర్థి పార్టీలను ఇరకాటంలో పెట్టించటంలో సక్సెస్ అయ్యారనే వాదనలు ఉన్నాయి. ఓ రకంగా భార్గవ్ అండ్ టీమ్? వైసీపీ అధికారంలోకి రావటం కోసం చేయని పనంటూ లేదనేది రాజకీయ వర్గాల్లోనూ వినిపించే మాట. ఆనాడు తాము చెప్పిందే నిజం? రాసిందే వార్త అన్నట్లుగా వ్యవహరించిన భార్గవ్.. ప్రస్తుతం ఎక్కడ ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.ఐదేళ్లకు పైగా.. వైఎస్సార్సీపీలో చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ.. సజ్జల భార్గవ్ మాట వినాల్సిన పరిస్థితి ఉందంటేనే అర్థం చేసుకోవచ్చు. అతని పవర్ ఏంటనేది. అతను పోస్ట్ చేసిందే వైసీపీకి రాజముద్ర. వన్ మ్యాన్ షోగా అంతా తానే వ్యవహరించి.. ఫ్యాన్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చాడనే వాదనలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగానూ.. ప్రత్యర్థులపై తనదైన శైలిలో ఆరోపణలు, అభాండాలు వేస్తూ? ఇరకాటంలో పెట్టడంతో భార్గవ్ సక్సెస్ అయ్యారట. తండ్రి కెమెరా ముందుకు వచ్చి.. అన్నీ తానై వ్యవహరించగా? కొడుకు మాత్రం తెర వెనుక ఉంటూ జగన్ పార్టీకి మేలు చేకూర్చారన్నది జగమెరిగిన సత్యంగా తెలుస్తోంది.నాడు వైసీపీ అధికారంలో ఉండగా ఇష్టానుసారంగా వ్యవహరించి.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పై అసభ్యకర పోస్టులు పెట్టించారంటూ భార్గవ్‌పై అభియోగాలున్నాయి. అంతేకాదు.. జగన్‌ను వ్యతిరేకించిన షర్మిలను కూడా వదలిపెట్టలేదట. ఆమెపైనా సోషల్‌మీడియా వేదికగా.. ఇష్టానుసారంగా పోస్టులు పెట్టించి.. ఆమె ఇమేజ్‌ను.. డ్యామేజ్ చేసేందుకు వందశాతం పని చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ.. కూటమిగా ఏర్పడటం.. జనాల్లోనూ వైసీపీపై వ్యతిరేకత రావటంతో గత ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ.. కేవలం 11 సీట్లకే పరిమితం అయ్యింది.ఆ ఓటమిలో.. తండ్రీ కొడుకులదే ఎక్కువ పాత్ర అనే ఆరోపణలూ బలంగా వినిపించాయి. వీరిద్దరూ లేకుంటే.. జగన్ మరోసారి సీఎం అయ్యేవారని.. సొంత పార్టీలోనే గుసగుసలు వినిపించాయట. ప్రతిపక్షాలను ఇరకాటంలో పెట్టేందుకు.. స్త్రీ, పురుష బేధం లేకుండా.. ఇష్టానుసారంగా పోస్టులు పెట్టడమే వైసీపీకి ఇబ్బందిగా మారిందనేది రాజకీయవర్గాల్లోనూ మార్మోగిన మాట. ఈ విషయంలో కొందరు సొంత పార్టీ నేతలే.. సజ్జల భార్గవ్ తీరుపై.. అధినేత జగన్‌కు ఫిర్యాదులు కూడా చేశారట. అయినా.. ఆయన పట్టించుకోకపోవటంతో.. పార్టీ డ్యామేజ్ అయ్యిందని.. తాము చెప్పినప్పుడు వింటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదనేది సొంత పార్టీ నేతలే చర్చించుకుంటున్నారట. జరగాల్సిన నష్టం జరిగింది. వైనాట్ 175 నినాదంతో ఎన్నికలకు వెళ్లిన జగన్..11 సీట్లకు పరిమితం అయ్యారు. ఇప్పుడు మాత్రం వినిపిస్తున్న మాట ఒకటే? వేరీజ్ సజ్జల భార్గవ్.కొత్త ప్రభుత్వం ఏర్పడి.. ఐదు నెలలు కావొస్తున్నా?భార్గవ్ రెడ్డి ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. ంఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో? నిధులు విడుదల చేసి.. ఆ డబ్బుతో జూఖీఅఖ సోషల్ మీడియా విభాగానికి మళ్లించారన్నది సజ్జల భార్గవ్‌పై ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న ఆరోపణ. దీనిపై ఇప్పటికే విచారణ మొదలైంది. కానీ..సజ్జల భార్గవ్ ఆచూకీ మాత్రం తెలియటం లేదు. సోషల్ మీడియా పేరుతో ఇటు ప్రభుత్వ.. ఇటు వైసీపీ నుంచి కోట్ల నిధులు వసూలు చేసినట్లు భార్గవ్ రెడ్డి పై ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విచారణ జరగాల్సి ఉండగా?భార్గవ్ కోసం పోలీసులు జల్లెడ పట్టారు. దేశ, విదేశాల్లోనూ తీవ్రంగా గాలిస్తున్నా.. భార్గవ్ ఆచూకీ మాత్రం లభ్యం కావటం లేదు. ఎన్ని రోజులు దాక్కున్నా.. ఏదో ఒకరోజు బయటకు రావాల్సిందే అనేది కూటమి నేతల మాటగా తెలుస్తోంది. సో.. ఇప్పుడు ఏపీ వ్యాప్తంగా వినిపిస్తున్నది ఒకటే. వేరీజ్ సజ్జల భార్గవ్.

# భారత దేశపు ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్

## -నేడు ఏక్తా దివస్... సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి

భారత దేశపు ఉక్కు మనిషి గా పేరుగాంచిన సర్దార్ వల్లభ్ భాయి పటేల్ జవేరిభాయ్, లాడ్ బాయి దంపతులకు 1875, అక్టోబరు 31న గుజరాత్‌లోని నాడియార్‌లో జన్మించాడు. ఇతను ప్రముఖ స్వాతంత్ర యోధుడిగానే కాకుండా స్వాతంత్రానంతరం సంస్థానాలు భారతదేశములో విలీనం కావడానికి గట్టి కృషిచేసి సఫలుడైన ప్రముఖుడిగా పేరుపొందారు. హైదరాబాదు, జునాగఢ్ లాంటి సంస్థానాలు భారతదేశములో విలీనం చేసిన ఘనత ఇతనికే దక్కుతుంది. ఇంగ్లాండులో బారిష్టరు పట్టా పుచ్చుకొని స్వదేశానికి తిరిగివచ్చి దేశంలో జరుగుతున్న జాతీయోధ్యమానికి ఆకర్షితుడై బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మహాత్మాగాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకున్నాడు. బార్డోలిలో జరిగిన సత్యాగ్రహానికి నాయకత్వం వహించి విజయవంతం చేయడమే కాకుండా తాను దేశప్రజల దృష్టిని ఆకర్షించాడు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలోనే కాకుండా దేశప్రజల సంక్షేమం కోసం అనేక సాంఘిక ఉద్యమాలను చేపట్టాడు. 1931లో జరిగిన



భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించాడు. భారత రాజ్యాంగం రచనలో ప్రముఖ పాత్ర వహించాడు. రాజ్యాంగ రచనలో అతిముఖ్యమైన ప్రాథమిక హక్కుల కమిటీకి చైర్మెన్‌గా వ్యవహరించాడు. స్వాతంత్రానంతరం జవహార్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని కేంద్రమంత్రిమండలిలో హోంశాఖ మంత్రి గానూ, ఉప ప్రధానమంత్రి గానూ బాధ్యతలను నిర్వహించాడు. దేశవిభజన అనంతరం అనేక ప్రాంతాలలో జరిగిన అల్లర్లను చాకచక్యంతో అణచివేశాడు. నెహ్రూ మంత్రిమండలిలో ఉన్ననూ అనేక విషయాలలో నెహ్రూతో విభేధించాడు. నెహ్రూ శాంతికాముకతను కాదని అనేక పర్యాయాలు బలప్రయోగం చేపట్టి సఫలుడైనాడు. కేవలం 40 మాసాలు మాత్రమే పదవిలో ఉన్ననూ అనేక దేశ సమస్యలను తనదైన పద్ధతితో పరిష్కరించి 1950 డిసెంబరు 15న మరణించాడు. మరణించిన 4 దశాబ్దాల అనంతరం 1991లో భారత ప్రభుత్వం భారతరత్న బిరుదాన్ని ఇచ్చి గౌరవించింది.

# వచ్చే నెల 2 నుంచి కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు

చిన్న చింతకుంట :శ్రీ కురుమూర్తి స్వామి జాతర బ్రహ్మోత్సవాలు నవంబర్ రెండవ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి మహబూబ్నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలో సప్తగిరుల మధ్య కొలువైన కురుమూర్తి స్వామి ఉత్సవాలు వచ్చే నెల 18వ తేదీ వరకు వైభవంగా కొనసాగుతాయి ఉత్సవాలకు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ కర్ణాటక మహారాష్ట్ర నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు వారి సౌకర్యార్థం దేవాదాయ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు వసతులు కల్పిస్తున్నట్లు ఈవో మదనేశ్వర్ రెడ్డి తెలిపారు ఉమ్మడి జిల్లాలోని ఆయా డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారుఉత్సవాల కార్యక్రమాల వివరాలు..నవంబర్ రెండవ తేదీ ఉదయం స్వామి వారి కళ్యాణం ఉత్సవం సాయంత్రం 6:15 నిమిషాలకు శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారికి మయూర వాహన సేవ జరుగు తుంది మూడవ తేదీ సాయంత్రం 6:00 20 నిమిషాలకు స్వామివారికి హంస వాహన నాలుగవ తేదీ సాయంత్రం 6:00 25 నిమిషాలకు శేష వాహన సేవ ఐదవ తేదీసాయంత్రం 6:00 25 నిమిషాలకు స్వామివారికి గజవాహన సేవ ఆరవ తేదీ సాయంత్రం స్వామివారికి బంగారు ఆభరణాలతో అలంకార ఉత్సవం రాత్రి 9 గంటలకు ఆశ వాహన సేవ ఏడవ తేదీ హనుమద్వాసన సేవ నిర్వహిస్తారు 8వ తేదీ ప్రధాన ఘటమైన ఉద్దాల ఉత్సవం చిన్నచింతకుంట మండలం లోని చిన్న వడ్డేమాన్ నుంచి ప్రారంభమై సాయంత్రం జాతర మైదానానికి చేరుకుంటుంది ఉద్దాలు కొండపైకి చేరుకున్న తర్వాత స్వామివారికి రాత్రి 10:45 నిమిషాలకు గరుడ వాహనంపై ఊరేగిస్తారు స్వామివారికి అలంకరించిన బంగారు ఆభరణాలు నవంబర్ 18 అన్న ఉత్సవాలు ముగిస్తాయి

# వెలుగొండ ప్రాజెక్టు దగ్గర దారుణమైన పరిస్థితులు

ఒంగోలు,పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పరిశీలనకు మంత్రి వచ్చారు. మంత్రి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు చూసి ఆశ్చర్య పోయాం. వెలుగొండ ప్రాజెక్టు ని జగన్ జాతికి అంకితం చేస్తే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేశారని భావించాం. కానీ ప్రాజెక్టు వద్ద దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. జగన్ ప్రభుత్వంలో ప్రాజెక్టు లు నాశనం అయ్యాయి. రాబోయే రోజుల్లో వెలుగొండ ప్రాజెక్టు ని చంద్రబాబు పూర్తి చేస్తారని అన్నారు.

# తల్లీకూతుర్ల ఆత్మహత్య

కాకినాడ,కాకినాడ నగరంలో మూడు రోజుల క్రితం తల్లి, కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. బిఆర్.అంబేద్కర్ కోనసీ మ జిల్లా పి.గన్నవరం మండలానికి చెందిన ఆకాశం సరస్వతి,ఆమె కుమార్తె స్వాతి గత కొన్ని ఏళ్లుగా కాకినాడ వార్ఫురోడ్ పెంకేవారి వీధిలో అద్దెకు నివాసం ఉంటున్నా ర ని 16 ఏళ్ల క్రితం సరస్వతి భర్త మృతి చెందాడని చిన్న కుమార్తె స్వాతి టైలరింగ్ చేస్తూ పోషిస్తుంది మృతుల ఇంటిలో దుర్వాసన రావ డంతో ఇంటి యజమాని పోలీసుల కు సమాచారం అందించారు.

# ఊర పందిని కోస్తే అడవి పంది అంటూ బెదిరింపు

## నాలుగు లక్షల డిమాండ్ చేసి 1,60,000 వసూలు

## అటవీశాఖ అధికారుల నిర్వాకం

పలమనేరు,చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పలమనేరు: రూరల్ మండలం బండమీద జరావారి పల్లికి చెందిన హరికృష్ణ మీడియాతో మాట్లాడారు. గత కొన్ని రోజులు ముందు మా ఊరు దగ్గర ఊర పందిని కోసుకుంటుంటే అడవి పంది అని చెప్పి అటవీ శాఖ అధికారులు మా వద్ద ఉన్న ఫోన్లు లాక్కొని చావబాదారన్నారు. అంతేకాకుండా కేసు కట్టకుండా ఉండేందుకు నాలుగు లక్షలు డిమాండ్ చేయగా మా దగ్గర ఉన్న గొర్రెలు,ఆవులు అమ్మి 1,60,000 ఇచ్చామన్నారు. ఈ ఘటనపై డిఎఫ్ఓకు ఫిర్యాదు చేసామన్నారు. న్యాయం చేయాల్సిందిగా మీడియాను కోరారు. కాగా ఈ ఘటనపై నిజా నిజాలు జిల్లా అటవీ శాఖ అధికారులు వెల్లడించాల్సి ఉంది

# భారీగా గంజాయి స్వాధీనం

అనకాపల్లి,జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా వి.మాడుగుల పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు చెక్పోస్టులు తనిఖీలో భాగంగా సుమారు 408 కేజీల గంజాయి రెండు కేజీల గంజాయి (యాశస్) గంజాయి లిక్విడ్ ని పట్టుకున్నామని అని అన్నారు . వీటి విలువ సుమారు 21లక్షల రూపాయలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. గాంజాయ్ అక్రమ రవాణకి తరలించే వెహికల్స్ ఒకలారీ. బొలెరో వ్యాన్. పల్సర్ మోటార్ బైక్ సీజ్ చేసామని అన్నారు .గాంజాయి అక్రమ రవాణాలో కేరళకు చెందిన ముగ్గురు స్మగ్లర్లు చింతపల్లి ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ముగ్గురు స్మగ్లర్లు మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.గాంజాయి అక్రమ రవాణా ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు . స్మగ్లర్ కోసం పోలీసులు గాలిస్తున్నామన్నారు.

# ఎయిమ్స్ లో డ్రోన్ సేవలు

విజయవాడ, అక్టోబరు 30, (న్యూస్ పల్స్)టెక్నాలజీ రోజురోజుకు ఓ రేంజ్‌లో అప్‌డేట్ అవుతుంది. సాంకేతికత కొత్త రూపు సంతరించుకుంటుంది. తాజాగా వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ రేంజ్ అప్‌గ్రేడేషన్ అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇక టెక్నాలజీని హెల్త్ సెక్టార్‌లో కూడా మిక్స్ చేసి.. అద్భుతాలు చేయాలని కేంద్రం ప్రణాళికలు పెట్టు?కుని ముందుకు వెళుంది. మంగళగిరి ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలను ప్రధాని నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. ఎయిమ్స్ వైద్యులు ప్రయోగాత్మకంగా డ్రోన్ పరీక్ష నిర్వహించారు. దానిలో భాగంగా.. ఎయిమ్స్ నుంచి నూతక్కి పీహెచ్‌సీ వరకూ డ్రోన్‌ను ప్రయోగించారు. ఓ మహిళా రోగి నుంచి బ్లెడ్ శాంపిల్ సేకరించిన డ్రోన్.. అక్కడి నుంచి ఎయిమ్స్‌కు తిరిగొచ్చింది. మంగళగిరి ఎయిమ్స్ నుంచి నూతక్కి ఈ ప్రాథమిక వైద్య కేంద్రం దాదాపు 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డ్రోన్ల ఉపయోగంపై ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు మంగళగిరి డాక్టర్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు, రక్త సేకరణ వంటి సేవల్లో డ్రోన్ల వినియోగం మంచి ఫలితాలు ఇస్తుందని ఆశిస్తున్నామన్నారు ఎయిమ్స్ వైద్యులు. మారుమూల ప్రాంతాల్లోని రోగులకు సమర్థవంతమైన వైద్య సేవలను అందించడంలో సాంకేతికతను ఉపయోగించుకోవడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

# పెట్రోల్ బంకు కు అతి సమీపంలో బాణాసంచా అమ్మకాలు

తణుకు ,పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం తేతలి దువ్వ జాతీయ రహదారి మధ్యలో నిబంధనలకు విరుద్ధంగా బాణా సంచా అమ్మకాలు జరుగుతున్నాయి. 30 డిగ్రీల ఎండలో రాసులుగా పోసి నాటు టపాకాయిలు, చిచ్చుబుడ్లు, ఉల్లి బాంబులు, జువ్వలు యధేచ్చగా అమ్మకాలు జరుగుతున్నాయి. పెట్రోల్ బంకుకు అతి చేరువలో నాటు సరుకుతో రాసులుగా పోసి అమ్మకాలు బాణసంచా వ్యాపారులు సాగిస్తున్నారు. లైసెన్స్ కు మించి భారీ ఎత్తున ప్రమాదకరమైన మందుగుండు సామాగ్రి సరుకు నిల్వలు ఉంచి అమ్మకాలు సాగిస్తున్నారు. సరైన అనుమతులు లేకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా స్ప్రింక్లర్లు, పరికరాలు లేకుండా హోల్ సేల్, రిటైల్ షాపులు ఏర్పాటుచేసారు.

# నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి...

సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి.
–జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్.



విభారె న్యూస్ అక్టోబర్ 30 కర్నూలు జిల్లా ప్రతినిధి..హోల్ సేల్ ట్రేడర్స్ , షాపుల యజమానులు సిసి కెమెరాలు స్వచ్ఛంధంగా అమర్చుకోవాలి. ప్రపంచంలో డిజిటల్ అరెస్టులు ఎక్కడా లేవు అటువంటి వదంతులు నమ్మకండి.సైబర్ నేరంకు గురైతే గంట లోపే డయల్ 1930 కి ఫోన్ చేసి సమాచారం అందించండి.బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో కర్నూలులోని హోల్ సేల్ ట్రేడర్స్ ,కిరాణా మర్చంట్ అసోసియేషన్,క్లాత్ మర్చంట్ అసోసియేషన్, బంగారు షాపు అసోసియేషన్ల తో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ సమావేశం నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు చేశారు.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఉద్యోగాల పేరుతో మోసపోకూడదన్నారు. కర్నూలు పట్టణంలో నేర నియంత్రణకు వ్యాపారస్తులు స్వచ్ఛందగా సిసి కెమెరాలు అమర్చుకోవాలన్నారు. నేరం జరిగన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహాకరించాలన్నారు. కర్నూలు పట్టణంలో మరిన్ని సిసి కెమెరాలు అమర్చేందుకు మున్సిపల్ శాఖ సహాకారంతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.ఎమైనా సమస్యలుంటే డయల్ 100 గాని లేదా డయల్ 112 కు గాని కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.సిబిఐ నుండి నుండి కాల్స్ చేస్తున్నామని,డిజిటల్ అరెస్టు పేరుతో వీడియో కాల్స్ ,అనవసర లింకులు క్లిక్ చేయవద్దని, ఓటిపిలు, డ్రగ్స్ కేసులో మీ అబ్బాయి ని కిడ్నాప్ చేస్తున్నామని, కొరియర్ వచ్చిందని ,లాటరీ తగిలిందని, పెట్టుబడులు పెట్టండి డబల్ చేస్తామని, అపరిచితుల నుండి వచ్చే వాట్సాప్ కాల్స్ చేస్తూ , వీడియో కాల్స్ చేస్తూ అమాయకులైన ప్రజలను సైబర్ నేర గాళ్ళు సైబర్ నేరాలకు గురిచేస్తున్నారన్నారు. జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిసిన బంధువులకు కూడా తెలియజేయాలన్నారు. అవగాహన చేయాలన్నారు.సైబర్ నేరం బారిన పడితే వెంటనే ఒక గంట లోపే 1930 కి సమాచారం అందించాలన్నారు.సైబర్ క్రైమ్ పోర్టల్ లో లిలిలి.ఇ.ఎవతీఇతీతిఎవ.ఐనీల.తిని ఫిర్యాదు చేయాలన్నారు.మైనర్లు బైక్ లు నడపడం, ట్రిపుల్ రైడింగ్,ట్రాఫిక్ సమస్యలు,పాతబస్తీ లో ఒన్ వే రూట్,పార్కింగ్ వంటి విషయాల గురించి వ్యాపారస్తులు ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కి విన్నవించారు.ఈ సమస్యల పై జిల్లా ఎస్పీ స్పందిస్తూ చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్,ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, కమాండ్ కంట్రోల్ సిఐ శివశంకర్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు ఖాజావలి, మల్లికార్జున, హనుమంతయ్య,కిరాణం అసోషియేషన్,క్లాత్ మర్చంట్స్ అసోషియేషన్, బంగారు షాపుల అసోషియన్ ల వారు పాల్గొన్నారు.

## ఎఆర్ ఎస్సై జి.వి సుబ్బారెడ్డి ని సన్మానించిన జిల్లా ఎస్పీ...



విభారె న్యూస్ అక్టోబర్ 30 కర్నూలు జిల్లా ప్రతినిధి.. సుధీర్ఘకాలం పోలీసుశాఖలో పని చేసి పోలీసు సిబ్బంది పదవి విరమణ పొందడం అభినందనీయమని కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ అన్నారు.ఆర్మ్డు రిజర్వ్డు హెడ్ క్వార్టర్ లో పని చేస్తున్న ఎఆర్ ఎస్సై జి.వి సుబ్బారెడ్డి బుధవారం పదవి వీరమణ పొందారు. ఈ సంధర్బంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆయన ను శాలువ,పూలమా లతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.పోలీసుశాఖకు వారు అందించిన సేవలను జిల్లా ఎస్పీ కొనియాడారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూకుటుంబంతో సంతోషంగా గడపాలని, పదవివీరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా జిల్లా ఎస్పీ ని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్అడిషనల్ఎస్పీ కృష్ణమోహన్,ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్,ఆర్ ఐ నారాయణ,జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడుకి ఘనంగా సన్మానం






అనంతపురం ప్రతినిధి: విభారే న్యూస్ అక్టోబర్ 30 రాయదుర్గం పట్టణంలోని స్థానిక డాక్టర్ రాధాకృష్ణ మునిసిపాలిటీ హై స్కూలు నందు ప్రధానోపాధ్యాయుడు తమ్మినేని చంద్రశేఖర్ నాయుడు పదవి విరమణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఆయనకు ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించారు పలువురు ఉపాధ్యాయుని , ఉపాధ్యాయులు మాట్లాడుతూ వృత్తినే దైవంగా భావించి 39 సంవత్సరాలాగా అనేక స్కూల్ నందు పనిచేసే తెలుగు పండిట్ గా పేరుగాంచిన వ్యక్తిని ఆయన కొనియాడారు, అనేక కవితలు తెలుగు పద్యాలు వాటిలో ఎంతో అర్థం ఎంతో భవిష్యత్తు అద్దం పట్టేలా ఉంటుందని వారు అన్నారు అంతేకాకుండా పదవి విరమణ అనగానే తమ్మినేని చంద్రశేఖర్ నాయుడు లాంటి మహోన్నత వ్యక్తులు అరుదుగా ఉంటారని పదవీ విరమణ తర్వాత మా మధ్య తాను లేకపోయినా వారి నేర్పిన పాఠాలు క్రమశిక్షణ మార్గంలోనే విద్యార్థులు ఉపాధ్యాయులు కూడా నడుచుకుం టామని వారు తెలిపారు అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఇలాంటి ఉపాధ్యాయుని పదవి విరమణ అనగానే కొంచెం ఆనందంగా ఉన్న మరోపక్క బాధగా ఉన్నట్టుగా వారు ఆవేదన వ్యక్తం చేశారు మిగిలిన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో జీవనం కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు ప్రధానోపాధ్యాయులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వార్డ్ కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కర్నూలు ఆర్ డి ఓ నీ కలసిన కూటమి నాయకులు వేల్పుల

గోపాల్ విభారే న్యూస్.. అక్టోబర్ 30 కర్నూల్ ప్రతినిధి కర్నూలు ఆర్ డి ఓ గా నూతన భాద్యతలు స్వీకరించిన సందీప్ కుమార్ నీ కోడుమూరు అసెంబ్లీలోని బిజెపి నాయకులు వేల్పులగోపాల్ కలిసి మాట్లాడుతూ కోడుమూరు అసెంబ్లీలో వున్నటువంటి గ్రామాల ప్రజలకు మరియు రైతులకు సంబందించినటువంటి సమస్యలను వారికి వివరించారు అనంతరం ఆర్ డి ఓ స్పందించి మాట్లాడుతూ మీరు మా దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించే విదంగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి కృషి చేస్తామన్నారు అనంతరం బిజెపి జనసేన నాయకులు రామ్ బాబు తదితర నాయకులు పాల్గొని శాలువతో సన్మానించారు.



## సర్వసభ్య సమావేశంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30 – ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి, ప్రభుత్వ అందిస్తోన్న సేవలు ప్రజలకు త్వరితగతిన చేరవేయడంతో పాటు, వారి నుంచి వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు.. బుధవారం బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండలం ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హజరయ్యి, స్థానిక చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి అతి త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.గతంలో ఏదైనా అభివృద్ధి కార్యక్రమాలు అర్థాంతరంగా నిలిచిపోతే, వాటిని తక్షణమే పూర్తి చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం మాదిరిగా కక్షపూరిత పాలన ఈ ప్రభుత్వంలో ఉండదని, అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని మండలంలోని ప్రజాప్రతినిధులకు మంత్రి సూచించారు. అదే సమయంలో అవుకు గ్రామంలోని ప్రజలు మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి దృష్టికి కొన్ని సమస్యలు తీసుకురాగా, వాటిపై స్పందించిన మంత్రి అక్కడిక్కడే ఎమ్మార్వో, ఎంపీడీవోలతో మాట్లాడి ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు . ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున అవుకు గ్రామ ప్రజలు సైతం హాజరవడం జరిగింది. ఈ కార్యక్రమానికి అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, ఎమ్మార్వో, ఎంపీడీవోలతో పాటు ఆరోగ్య, వ్యవసాయ, నీటిపారుదల, ఆర్ ఉ బీ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయితీ రాజ్ శాఖ, ఉపాధి హామీ తదితరుల శాఖల అధికారులు హాజరయ్యారు.

## మెగా పేరెంట్స్ టీచర్స్ మేళా ను జయప్రదం చేయండి

జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30 – నవంబర్ 14 వతేదిన జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మేళా ను జయప్రదం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామకృష్ణారెడ్డి డిగ్రీ కళాశాలలో జిల్లా విద్యా శాఖాధి కారి జనార్ధన్ రెడ్డి మండల విద్యాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండల విద్యా శాఖధికారులతో పరిచయ కార్యక్రమం అనంతరం విద్యా శాఖ లో అమలులో ఉన్న అతి ముఖ్యమైన అంశాలు స్కూల్ కాంప్లెక్స్ లు, ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ, నవంబర్ 14 న జరుగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మేళా -6 ఫార్ ఏజోస్, షని సర్దుబాటు, పియం పాఠశాలలు, పాఠశాల మౌలిక వసతులపై మండల విద్యా శాఖధి కారులతో సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖకు సంబంధించిన అన్ని అంశాల ప్రగతిలో జిల్లా ముందంజలో ఉండాలని ఎక్కడ ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలని సూచించారు . మద్యాహ్న భోజనం. ఆయాల పనితీరు, టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖధి కారితోపాటు, ఉప విద్యాధికారి మహమ్మద్ బేగ్, జిల్లా అకడమిక్ మానిట రింగ్ అధికారి లలిత, ఉర్దూ డివి హస్మ్మజ్షిన్, మండల విద్యాధి కారులు హాజరయ్యారు.



## నరసింహానంద్ సరస్వతి పై తక్షణమే చర్యలు తీసుకోవాలి



విభారె న్యూస్ అక్టోబర్ 30 ఆళ్లగడ్డ మా ప్రతినిధి :– ప్రపంచ శాంతి ప్రదాత జగత్ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై అనుచిత వ్యాఖ్యలు చేసి హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టాలని ప్రయత్నం చేసిన మతోన్మాది నరసింహానంద్ సరస్వతి పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిఎస్పి రవికుమార్ కు ఆళ్లగడ్డ జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ జేఏసీ కన్వీనర్ బీరువాల భాష మాట్లాడుతూ భారత దేశంలో మతోన్మాదులకు స్థానం లేదని మతోన్మాదులు ఉగ్రవాదులతో సమానమని ఉగ్రవాదులు ఏ జాతికి ఏ మతానికి సంబంధించిన వారు కారనీ అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందూ, ముస్లింల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా ప్రసంగించే వారు మానవులలోనే చేరిక కారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు స్వాంతన చేకూర్చాలని డీఎస్పీని బీరువాళ భాష కోరారు.అందుకు సానుకూలంగా స్పందించిన డి.ఎస్.పి రవికుమార్ ఈఫిర్యాదుపైతప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ జేఏసీ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ జేఏసీ సభ్యులు గౌస్ పీర్ ,మసీఉల్లా అబ్దుల్ ఖాదర్ తదితర సభ్యులతో పాటు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల కు భూమి పూజ




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30 – బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి భూమి పూజ చేశారు. రూ. 60 లక్షల అంచనా వ్యయంతో అవుకు గ్రామంలోని ఎస్సీ కాలనీ సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సీసీ రోడ్ల పనులను రెండు దశల్లో ప్రారంభించాలని స్థానిక అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మమేకమైన మంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, ఇంకా ఏదైనా అపరిష్కృత సమస్యలు ఉంటే, వాటిని తన దృష్టికి తీసుకొస్తే త్వరితగతిన పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

## పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

బషీరున్నీషాభేగం జిల్లా కార్మిక శాఖ అధికారిణి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30 – – – 18 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని నంద్యాల జిల్లా కార్మిక శాఖ ఆధికారిణి బషీరున్నీషాభేగం హెచ్చరించారు. ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. పట్టణంలో పిల్లలు షాపుల లో కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వ్యాపారాలు. ఇతర ఏ పనుల్లో ఎక్కడైనా సరే బడి ఈడు పిల్లలచే పనులు చేయిస్తే వారిని ఉపేక్షించేది లేదన్నారు. నిబంధనలు అతిక్రమించిన యజమానికి రెండేళ్ల జైలు శిక్ష. 50 వేలు జరిమానా విధించ బడునని హెచ్చరించారు. బడి ఈడు పిల్లలను బడిలోనే ఉంచి వారి భవిష్యత్తు కు బంగారు బాటలు వేయాలని సూచించారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190